www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా /శ్రీ సత్యసాయి జిల్లా

# జిల్లా కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత

- 3మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించండి
- రెవెన్యూ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి



**అనంతపురం, జూన్ 10. అక్షర టైమ్స్:** రాప్తాడు నియోజకవర్గంలోని భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె అనంతపురంలోని కలెక్టరేట్ కు వెళ్లి కలెక్టర్ ఓ.ఆనంద్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలలోని సమస్యల గురించి చర్చించారు. ఈ మూడు మండలాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, మరికొన్ని పనులకు కావాల్సిన నిధులకు సంబంధించి కలెక్టర్ కు వివరించారు. మరోవైపు ఈ మూడు మండలాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తాము ఎప్పుడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించినా.. భూ సమస్యల మీదనే ఎక్కువగా అర్జీలు వస్తున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పని తీరు గురించి కూడా ప్రత్యేకంగా చర్చించారు. కొన్ని చోట్ల సిబ్బంది తగినంత లేకపోవడం, కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండటం వలన సమస్యల పరిష్కారానికి జాప్యం జరుగడంతో పాటు ప్రజలకు సరైన సేవలు అందడం లేదన్నారు. ఎమ్మెల్యే సునీత చెప్పిన అంశాలపై కలెక్టర్ ఓ.ఆనంద్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పోస్టులు భర్తీ చేస్తామని.. భూ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

# ఎస్ఐఆర్ ను ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోండి

- ముదిగుబ్బ మండల నాయకులకు పరిటాల శ్రీరామ్ సూచన
- 23మందికి రూ.15.95లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం
- ఘనంగా ఎమ్మెల్యే నందమూరి జన్మదిన వేడుకలు





**ధర్మవరం,జూన్10.అక్షర టైమ్స్:** మరో నాలుగు రోజుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలు కానుందని.. దీనిని ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలని ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ నాయకులకు సూచించారు. ధర్మవరంలోని పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ పై ముదిగుబ్బ మండల నాయకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ ఛార్జిలు, మండల నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పై తీసుకోవాల్సిన జాగ్రత్తల మీద శ్రీరామ్ దిశా నిర్దేశ్యం చేశారు. ప్రతీ 20–25 ఏళ్లకోసారి కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపడుతుందని.. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఇది ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 15వ తేది నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టబోతోందని కావున క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని ఆ సమయంలో ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బీఎల్ఏలు హౌస్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. అవసరమైతే రెండవ సారి కూడా మ్యాపింగ్ చేయాలన్నారు. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించాలని.. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని అన్నారు. ప్రతి ఓటు మనకు కీలకమని.. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉందన్నారు. గడిచిన ఎన్నికల్లో పని చేసిన విధంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్లా విజయం సాధించే విధంగా పని చేయాలని పార్టీ నాయకలకు శ్రీరామ్ సూచించారు..

**23మందికి రూ.15.95లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

పేదల ఆరోగ్యం విషయంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా సాయం అందుతోందని ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పార్టీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం, ముదిగుబ్బ మండలాలతో పాటు ధర్మవరం పట్టణానికి చెందిన 23మందికి రూ.15.95లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు శ్రీరామ్ తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా రెండేళ్లలోనే 404 మందికి రూ.2.64 కోట్ల రూపాయలు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించినట్టు చెప్పారు. ఎన్టీఅర్ వైద్య సేవలను విస్తృతం చేయడంతో పాటు అత్యవసర సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్టు తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల తరుపున శ్రీరామ్ కృతజ్ఞతలు తెలిపారు...

**ప్రజా దర్బార్, బాలయ్య జన్మదిన వేడుకలు**

ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు శ్రీరామ్ కు సమస్యలు చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరితో ఓపిగ్గా మాట్లాడుతూ వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో ప్రధానంగా ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి సమస్యలు ఉన్నాయి. త్వరలోనే కొత్త పింఛన్లు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని శ్రీరామ్ అన్నారు. ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. మరోవైపు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీరామ్ కేక్ కట్ చేసి నాయకులకు అందజేశారు. తండ్రి ఎన్టీఆర్ చూపిన మార్గంలో సినిమాల్లోనే కాకుండా రాజకీయాల్లో కూడా బాలక్రిష్ణ తనదైన ముద్ర వేసుకున్నారని శ్రీరామ్ అన్నారు. హిందూపురంలో వరుసగా 3సార్లు గెలిచి తనకు ఎదురులేదని నిరూపించుకున్నారన్నారు. అంతే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా బాలక్రిష్ణ ముందున్నారన్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడారన్నారు. నటుడు, రాజకీయ నాయకుడిగానే కాకుండా సేవా కార్యక్రమాలతో కూడా ప్రజల గుండెల్లో ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారని శ్రీరామ్ అన్నారు.

## టెట్ పరీక్షల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలి

- జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి




**అనంతపురం,జూన్10.అక్షర టైమ్స్:** రాజమండ్రి లో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ నందు జరిగిన ఎస్టీయు ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ మేనేజ్ మెంట్ లలో 2012కు ముందు పని చేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణులు కావాలని సుప్రీం కోర్టు తెలిపిన నేపథ్యంలో దీనిపై రాష్ట్ర సంఘం ప్రత్యేక చొరవ చూపి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఉపాధ్యాయుల కోసం ప్రయత్నం చేయాలన్నారు. అలా కాని పక్షంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి అర్హత మార్కులు తగ్గించి నోటిఫికేషన్ విడుదలకు తప్పక కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రాష్ట్ర సంఘ ప్రతినిధులకు జిల్లా శాఖ పక్షాన కొన్ని ప్రతిపాదలను తెలియ చేస్తూ వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలియజేశారు. అలాగే ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధనకై ప్రత్యేక దృష్టి పెట్టాలని వాటిని సాధించి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ లకు లెక్చరర్స్ గా పదోన్నతులు కల్పించుటకు తప్పక కృషి చేయాలని కోరారు. దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్లులు త్వరగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు క్రెడిట్ అయ్యేటట్లు చేయాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పిఆర్సీకు త్వరగా కృషి చేయాలని, దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న డీఏలు, ఆర్థిక శెలవుల నగదు బకాయిలను ఇప్పించుటకు త్వరగా కృషి చేయాలని కోరారు. జిల్లాల విభజనలో ఉద్యోగ, ఉపాధ్యాయ కేటాయింపులకు ఎవరికీ అన్యాయం జరగకుండా రాష్ట్ర అధికారులతో మాట్లాడి ఉపాధ్యాయులకు తోడుగా ఉండాలని కోరారు. అలాగే అనంతపురం జిల్లాకు పూర్తి స్థాయి డీఈఓ అధికారిని నియమించేందుకు రాష్ట్ర అధికారులతో మాట్లాడి రెగ్యులర్ డీఈఓని నియమించుటకు కృషి చేయాలని కోరారు.

## పాముురాయి చెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నాం

- రూ.50లక్షల వాటర్ షెడ్ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- ప్రతి ఒక్కరూ సందర్శించేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామన్న సునీత





**అనంతపురం,జూన్10.అక్షర టైమ్స్:** అనంతపురం రూరల్ మండల పరిధిలోని సోమలదొడ్డి పంచాయతీలోని పాముురాయి చెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక నాయకులు, అధికారులతో చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా నీటి నిర్వహణ సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో.. సాంప్రదాయ జల వనరుల పునరుద్ధరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా ఈ చెరువును పర్యాటక ప్రాంతంగా మార్చబోతున్నామన్నారు. వాటర్ షెడ్ డెవలప్మెంట్ కాంపోనెంట్ – ప్రధాన మంత్రి కృషి శిచాయి యోజన – 2.0కార్యక్రమం ద్వారా రూ.50లక్షల వాటర్ షెడ్ నిధులతో ఇక్కడ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను వెచ్చించనుంది. చెరువు పై చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, వసతుల కల్పన గురించి మైనర్ ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సునీత చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఇది స్థానిక ప్రజలకే కాకుండా బెంగళూరు–హైదరాబాద్ మార్గంలో వెళ్లే వారికి ఒక పిక్నిక్ స్పాట్ గా మారుతుందన్నారు. ప్రధానంగా చెరువు కట్టను విస్తరించి బలోపేతం చేస్తామన్నారు. వాకింగ్ ట్రాక్ ను నిర్మించడం, సోలార్ లైట్లు, ఆర్.సి.సి బెంచీల ఏర్పాటు, పిల్లల పార్కు, ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. త్వరలోనే ఈ పనులు పూర్తి చేస్తామని.. కచ్చితంగా ఇది ఒక ఆహ్లాదాన్ని పంచే ప్రాంతంగా గుర్తింపు పొందుతుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# కార్పొరేట్ రిటైల్ పై నియంత్రణ

వస్త్ర వ్యాపారం సంఘ అధ్యక్షుడు కోటి వెంకటేష్,తదితర సంఘం అధ్యక్షులు వెల్లడి

**ధర్మవరం,జూన్10.అక్షర టైమ్స్:** కార్పొరేట్ రిటైల్ పై నియంత్రణ ఉండాలని, భారీ షాపింగ్ మాల్స్ నుంచి రక్షించాలని వస్త్ర వ్యాపారం సంఘము అధ్యక్షుడు కోటి వెంకటేష్, కిరాణా సంఘం అధ్యక్షుడు పిన్ను ప్రసాద్, గోల్డ్ షాప్ అధ్యక్షులు ఖలీల్, స్వీట్ షాపుల సంఘం లడ్డు బాబు, ఆటోమొబైల్ సంఘం అధ్యక్షులు వెంకటరమణ, ఆల్ టైలర్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరంలో నాడు స్థానిక వ్యాపార అభివృద్ధి లక్ష్యంగా 18 వ్యాపార సంఘ ల ఐకమత్యంతో ది ఆల్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు కు, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్కు, ధర్మవరం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి కు, ధర్మవరం సబ్ డివిజన్ అధికారికు స్థానిక చిన్న, మధ్య తరహా వ్యాపార సముదాయాలను కార్పొరేట్ రిటైల్ చైన్ల భారీ షాపింగ్ మాల్స్ నుంచి రక్షించ వలసిందిగా వినతి పత్రాలు అందజేశారు. తదుపరి అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మా సంఘంలో ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధిగా చిన్న , మధ్య తరహా వ్యాపారాలు నిర్వహిస్తున్న యువత తో పాటు చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు , సాంప్రదాయ వృత్తులపై ఆధారపడిన వారు చాలామంది ఉన్నారు అని తెలిపారు. వీరి జీవనాధారం పూర్తిగా స్థానిక వ్యాపారంపై ఆధారపడి ఉన్నది అని, ప్రస్తుతం పెద్ద కార్పొరేట్ రిటైల్ సంస్థలు , మాల్స్ మార్కెట్ ను గుత్తాధిపత్యంగా మార్చి నష్టాలతో అమ్మకాలు చేసి చిన్న వ్యాపారులను దెబ్బతీయడం వంటి చర్యల ద్వారా మా పరిస్థితి " అడ కత్తెర లో పోక చెక్క" వలే అయినది అని బాధను వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇది స్థానిక వ్యాపార వ్యవస్థను బలహీనపరిచి, వేలాది కుటుంబాల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. కావున " మన ఊరు–మన దుకాణం " అనే నినాదంలో నగదు బదిలీ జరిగి స్థానిక వ్యాపారస్తుల అభివృద్ధితో పాటు ప్రజల జీవన నాణ్యత , విద్య , వైద్యం , పేదరిక నిర్మూలన వంటి అంశాలను ప్రభావితం చేస్తుంది. కార్పొరేట్ వ్యవస్థ పేదరికాన్ని నిరుద్యోగాన్ని పెంచి దేశ పురోగతిని మందగింప చేస్తాయి అని తెలిపారు. కావున దయచేసి స్థానిక





వ్యాపారులకు ప్రాధాన్యత కల్పించి మన ధర్మవరంలో పెద్ద రిటైల్ చైన్ల పై నియంత్రణ చేయవలసిందిగా అధికార పార్టీ నాయకులను కూడా కోరడం జరిగింది అన్నారు.. ఈ సందర్భంగా అధికార పార్టీ నాయకులు మాట్లాడుతూ స్థానిక ప్రజల సంరక్షణ మా బాధ్యత అధికారులతో మాట్లాడి మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో వివిధ వ్యాపార సంఘానికి సంబంధించిన వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలకృష్ణ జన్మదిన సందర్భంగా రక్తదానం








**హిందూపురం,జూన్10.అక్షర టైమ్స్:** హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్నందమూరి బాలకృష్ణ 66వ జన్మదిన సందర్భంగా హిందూపురం తెలుగు యువత తెలుగుదేశం పార్టీ అభిమానులు బాలకృష్ణ అభిమానులు సుమారు వెయ్యి మందికి పైగా రక్తదానం చేశారు. ఎమ్మెల్యే కార్యాలయం నందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి ఏ బాలాజీ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ లు జె ఇ అనిల్ , డి ఈ రమేష్ కుమార్ , నాగరాజు రూరల్ మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వృద్ధులకు అందని బియ్యం, మూడు రోజులకే మూతపడుతున్న చౌకు ధాన్యపు డిపోలు

రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ జి.సురేష్ కుమార్

**ధర్మవరం,జూన్10.అక్షర టైమ్స్:** నేడు వృద్ధులకు బియ్యము అందడం లేదని మూడు రోజులకే చౌకు ధాన్యపు డిపోలు మూతపడుతున్నాయని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ జి. సురేష్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వినియోగదారుల సమాచార కేంద్రం నందు తంబి చిన్నప్ప అధ్యక్షతన ఏర్పాటుచేసిన వాటికి ముఖ్యఅతిథిగా సురేష్ కుమార్ రావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులు నడవలేని 60 సంవత్సరములు పైబడిన వారికి సైతం ఇంటి వద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అమలు కావడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో చౌక ధాన్యపు డిపోల నందు వృద్ధులు వేలిముద్ర వేయడానికి తంటాలు పడవలసి వస్తుందని అక్కడికి పోతే వేలిముద్ర పడలేదని తిరిగి పంపుతున్నారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా కేవలం మూడు నాలుగు రోజులు రేషన్ పంపిణీ చేసి అనంతరం స్టాక్ లేదని త్రిప్పి పంపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ డీలర్లలో మార్పు రావడంలేదని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలానికి ఒక సివిల్ సప్లై మరియు వినియోగదారుల వ్యవహారాల కోసం ఒక డిప్యూటీ తాసిల్దార్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో తనిఖీల నిర్వహించకపోవడం వల్లే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వారు స్పష్టం చేశారు. ప్రతినెల వృద్ధులకు పింఛన్లు ఇచ్చే విధంగా ఆయా స్టోర్ ల నందు వృద్ధులు ఎంతమంది ఉన్నారు అనే సమాచారం కచ్చితంగా సచివాలయ ఉద్యోగుల వద్ద ఉంటుంది కాబట్టి సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్లు వారిని కలుపుకుని మండల వ్యాప్తంగా ఉన్నటువంటి వృద్ధుల కు




పెన్షన్ ఏ విధంగా అందుతుందో అదే విధంగా రేషన్ కూడా అందేటట్లుగా చూడాలని తెలియజేశారు. చౌక ధాన్యపు డిపో నందు కంప్లైంట్ నంబరు, క్యూఆర్ కోడ్ ప్రజలకు కనపడే విధంగా పెద్ద అక్షరాలతో ఏర్పాటు చేయాలని తద్వారా ప్రజలకు అందవలసిన రేషన్ కచ్చితంగా అందుతుందని తెలియజేశారు. రేషన్ దుకాణం ఎన్ని రోజులు తీసి ఉంచాలి అన్న దానిపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నతస్థాయి అధికారులు డీలర్లకు ఇవ్వాలని లేనిచో మూడు నాలుగు రోజులకే రేషన్ డిపోను మూసివేస్తారని తెలిపారు.ప్రతి మండలంలోని విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్లయితే చౌక ధాన్యపు డిపోల పర్యవేక్షణ మరియు ప్రజలకు అవగాహన కలిగించేందుకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పల్లెం జనార్ధన్ ,ప్రధాన కార్యదర్శి గుర్రం వేణుగోపాల్ క్యాప్కో నారాయణమ్మ, వైస్ ప్రెసిడెంట్ సెల్వరాజ్, బి ఎజన్న, నవీన్ కుమార్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## బండి గంగులప్ప వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం



**అమడగూరు.జూలై10.అక్షర టైమ్స్:** మండల పరిధిలోని గాజులపల్లి సమీపంలో ఉన్న శ్రీ మాత్రే వృద్ధాశ్రమం నందు ముదిగుబ్బ మండలం మలకవేముల క్రాస్కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు బండి మల్లికార్జున తండ్రి, స్వర్గీయ బండి గంగులప్ప ప్రథమ వర్ధంతి సందర్భంగా అమడగూరు మండలం గాజులపల్లి గ్రామంలోని శ్రీ మాతృ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనాలు అందించి, వారి ఆశీస్సులు పొందారు. స్వర్గీయ బండి గంగులప్ప సేవా భావాన్ని స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ మాతృ వృద్ధాశ్రమం చైర్మన్ అరుణమ్మ, బండి మల్లికార్జున, బండి నాగేశ్వరి, బండి ధనుష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ తండ్రి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన తాసిల్దారుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్,ఏంఎస్పి నాయకులు



**తాడిమర్రి,జూన్10.అక్షర టైమ్స్:** తాడిమర్రి తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన రెడ్డి లక్ష్మి తాసిల్దార్ను బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంపీస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు, ఇ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు శివయ్య మాట్లాడుతూ దళిత సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో బండారు రామాంజనేయులు బండారు నాగరాజు బండారు రాము సాకే నాగరాజు బండారు నరేంద్ర పప్పు రు రామాంజి తదితరులు పాల్గొన్నారు

## సుపరిపాలనకు 12 ఏళ్లు బిజెపి నాయకుల చే శివాలయంలో పూజలు






**తాడిమర్రి,జూన్10.అక్షర టైమ్స్:** ప్రియతమ నేత ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన 12 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం తాడిమర్రి శివాలయం నందు బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించరు,గుడి పరిసర ప్రాంతాలు పరిశుభ్రం చేసి, గ్రీన్ అంబాసిడర్లకు చీరలు పంపిణీ చేసి, శివాలయంలో మోడీ జీ ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు భారతదేశానికి సుపరిపాలన అందించవలసినదిగా కోరుకుంటూ మోడీజీ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవర రామ్మోహన్ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోతులయ్య జిల్లా కిసాన్ వచ్చే ఉపాధ్యక్షులు గోవింద గంగులప్ప జిల్లా కిసాన్ మోర్చా మెంబెర్ బిల్లే చంద్ర,సీనియర్ నాయకులు కదిరప్ప నారాయణస్వామి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తూకం తక్కువ,ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మే వారికి అపరాదరుసుం

- ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు: సిఐశంకర్





**పామిడి,జూన్10.అక్షర టైమ్స్:** తూనికల కొలతల ఇన్స్పెక్టర్ వై.జి శంకర్ బుధవారం పామిడి పట్టణంలో వివిధ దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. బీసీసీ రోడ్డుకు ఇరువైపుల ఉన్న వివిధ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా. వాటిలో కొన్ని దుకాణాలలో ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాల్లో భారీ తేడాలు ఉండడంతో ఆదుకాణాలపై కేసులు నమోదు చేశామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలువురు వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలతో తూకంలో ప్రజలను మోసం చేస్తున్నారని, తమకు ఫిర్యాదులు అందడంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా బెంగళూరు బేకరీ నందు ఒక కేజీ కేక్ కొనగా 120 గ్రాములు తక్కువ తూకం ఉన్నందున కేసు నమోదు చేసి 5000 రూపాయలు అపరాధ రుసుము కట్టించడమైనది. అలాగే మూడు షాపుల యందు ఒక సీగరేట్ ప్యాకుపైన 10 నుంచి20 రూపాయలు అధిక ధరలకు విక్రయిస్తున్నందున 5000,5000, 40 వేలు అలాగా మొత్తం 55,000 అపరాధ రుసుము ప్రభుత్వానికి ఆన్లైన్లో కట్టించబడినదని ఆయన తెలియజేశారు. తక్కువ తూకం, ఎక్కువ ధరలకు అమ్మిన లీగల్ మెట్రోలజీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడును ఆయన పేర్కొన్నారు.నిర్ణీత కాల పరిమితి పూర్తయిన వెంటనే తిరిగి కాటాలకు అనుమతి తీసుకోవాలని,తూకంరాళ్ళకు ముద్రలు వేయించుకోవాలని. నిర్ణీత గరిష్ట ధరలు ఎమ్మార్పీ కంటే ఎక్కువ విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వైజి.శంకర్ సిబ్బంది రుక్సానా, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బుక్కరాయసముద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ సీఐ గా ఎం. సుబ్బరాయుడు బాధ్యతలు స్వీకరణ

- ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు




**ఉక్రాయసముద్రం,జూన్10.అక్షర టైమ్స్:** బుక్కరాయసముద్రం మండలం పరిధిలోని పోలీస్ స్టేషన్లో గత కొంతకాలంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సిఐ పుల్లయ్య అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ కి ట్రాన్స్ఫర్ కావడంతో, తర్వాత ఆయన స్థానంలో నూతనంగా సుబ్బరాయుడు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన సిఐ సుబ్బరాయుడు ఎస్సై రాంప్రసాద్ ఎస్ఐ గోవింద్ పోలీస్ ఇబ్బంది స్వాగతం పలికారు. సిఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, అసాంఘిక కార్యకలాపాల పట్ల అక్రమార్కుల పట్ల కఠినంగా ఉంటానని తెలిపారు.

## ఎంపిఆర్ డ్యాంను సందర్శించిన జిల్లాకలెక్టర్

- పర్యాటకులను ఆకర్షించేలా ఎంపిఆర్ డ్యాంను తీర్చిదిద్దుతాం





**పామిడి/గార్లదిన్నె,జూన్10.అక్షర టైమ్స్:** గార్లదిన్నె మండల పరిధిలోని మిడ్ పెన్నార్ రిజర్వ్ డ్యాం (ఎం.పి.ఆర్ డ్యాం)పెనకచర్లడ్యాంను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ బుధవారం పలుశాఖల అధికారులతో కలిసి సందర్శించారు. డ్యాం వద్ద జరుగుతున్న గేట్ల మరమ్మత్తు పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎం.పి.ఆర్ డ్యాంను జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యాటకుల కోసం రహదారుల అభివృద్ధి, బోటింగ్ సౌకర్యం, గార్డెన్లు, వసతి గృహాలు, గెస్ట్ హౌస్ల పునరుద్ధరణతో పాటు ఇతర పరిసరాలు ఆహ్లాదకరమైన సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతపురం నగరానికి సమీపంలో ఉన్న ఈజలాశయ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పర్యాటకులకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే విధంగా రిసార్ట్లు, హోటళ్లు, వినోద సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. డ్యాం బ్యాక్వాటర్ అందాలను ప్రజలు సురక్షితంగా వీక్షించేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఇరిగేషన్, టూరిజం, ఆర్అండ్బీ, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, అటవీ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రానున్న రోజుల్లో ఎం.పి.ఆర్ డ్యాం జిల్లా ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఓబులమ్మ, గార్లదిన్నె, కూడేరు తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఆర్ ఐ లు,తదితర అధికారులు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## ఐక్యమత్యమే మహాబలం భారీ ర్యాలీలో పాల్గొనండి: నైరుతిరెడ్డి

- ఐక్యంగా పోరాడుదాం ప్రభుత్వాన్ని చేపడుదాం



**పామిడి,జూన్10.అక్షర టైమ్స్:** చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తి కార్యక్రమంలో నిరసనల భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న భారీర్యాలీల సందర్భంగా మన నియోజకవర్గం కేంద్రమైన గుంతకల్లు పట్టణంలో వైయస్సార్సీపి సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 12న శుక్రవారం బారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామని ఈకార్యక్రమానికి పామిడి మండలంలో ఉన్న ప్రతి వైయస్సార్ కుటుంబ సభ్యులు నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు అభిమానులు అందరూ పాల్గొనవలసినదిగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అందరం కలసికట్టుగా ఐక్యంగా పోరాడుదాం,జగనన్న నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సాదిద్దాం రండి కదలిరాండని ఆమె పిలుపునిచ్చారు. శుక్రవారంన గుంతకల్లులోని వైయస్సార్సీపి కార్యాలయం నుండి ఉదయం 10 గంటలకు భారీ ఎత్తున మహార్యాలీతో బయలుదేరి మెయిన్ రోడ్డు మీదుగా పొట్టి శ్రీరాములు సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ గుండా,పాత బస్టాండ్ లోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కావున వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులందరూ పాల్గొనవలసినదిగా ఆమె కోరారు.

## పామిడిలో స్వచ్ఛపథం కార్యక్రమం



**పామిడి,జూన్10.అక్షర టైమ్స్:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరప్రాంతం అంతయూ డిప్యూటీ ఎంపీడీవో (ఇఓ) అశ్వర్ధనాయుడు ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో తేజష్ణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ వారం ఆర్టిసి బస్టాండ్ ఆవరణతో సహా పరిసర ప్రాంతమంతయు పరిశుభ్రత చేస్తున్నామన్నారు. వారానికి ఒక్కసారి వచ్చే ప్రతి బుధవారం పామిడి పంచాయతీ పరిధిలో ఏదో ఒక ప్రాంతంలో స్వచ్ఛ పథంను నిర్వహిస్తూ ఉంటాంమన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు తడిపొడి చెత్తను పంచాయతీ వాహనం ద్వారా సుదీర్ఘ ప్రాంతంలో ఉన్న డంప్ కేంద్రానికి తరలిస్తామన్నారు. ఇలాగే మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో కూడా ఆయా సచివాలయాల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో తేజోష్ణ, డిప్యూటీ ఎంపీడీవో (ఇఓ) అశ్వర్థనాయుడు, కార్యదర్శులు నాగరాజు,సుధాకర్,దాక్షాయిణి, పంచాయతీ సూపరిండిట్ ఖాజా మహమ్మద్,మేస్త్రీ సురేష్, తదితర పంచాయతీ కార్యాలయం సిబ్బంది,కార్మికులు పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్ గ పదోన్నతి పొందిన రాప్తాడు తాహాసిల్దారు కు ఘన సన్మానం




**అనంతపురం,జూన్10.అక్షర టైమ్స్:** ఈరోజు స్థానిక రాప్తాడు తహసిల్దార్ కార్యాలయం నందు డిప్యూటీ కలెక్టర్ గ పదోన్నతి పొందిన విజయ్ కుమారి ని ఘనంగా సన్మానించిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పూజారి చెన్నకేశవులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుండి రాప్తాడు మండలం నందు ప్రజలకు రైతులకు విశిష్ట సేవలు అందించి మండల ప్రజలకు అనేక సేవలందించి పదోన్నతి పై శ్రీ సత్య సాయి జిల్లా డిప్యూటీ కలెక్టర్ గ వెళ్ళినందుకు దళిత ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు ఇలాగే రాబోయే రోజుల్లో అనేక ఉన్నత పదవులు పొందాలని దళిత ప్రజా సంఘాలు కోరుకుంటున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కురుగుంట గోవిందు. ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్. మండల సహాయ కార్యదర్శి పి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు వీరందరూ కలిసి సన్మానించడం జరిగినది

## ఆమడగూరు మండలం,ఏపీ.మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

- ప్రిన్సిపాల్ ఏపి మోడల్ స్కూల్



**అమాడగూరు,జూన్10.అక్షర టైమ్స్:** మండల పరిధిలో.గాజులపల్లి గ్రామం వద్ద ఉన్న మోడల్ స్కూల్ కాలేజీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శిరీష మేడం తెలియజేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్లో మిగిలివున్న 6వ తరగతి, 7వ తరగతి, 8వ తరగతి, 9వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ 10-06-2026 నుండి 20-06-2026 వరకు జరుగుతుంది. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం 24-06-2026న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా 25-06-2026న ప్రకటించబడుతుంది. సర్టిఫికేట్ పరిశీలన మరియు ప్రవేశాలు 26-06-2026న నిర్వహించబడతాయి. విద్యార్థులు తప్పనిసరిగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. మిగిలిన ఖాళీలను స్థానిక మరియు స్థానికేతర అభ్యర్థుల నుండి నిబంధనల ప్రకారం భర్తీ చేయబడును. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరడమైనది.ఏదైనా సందేహాలుంటే పాఠశాలను సందర్శించాలని తెలిపారు.

## పదవీకాలం ముగిసినా సేవలు కొనసాగుతూనే..

- రూ.1.01 కోట్ల అభివృద్ధి పనులతో 30వ వార్డుకు కొత్త రూపు

- భగత్సింగ్ నగర్లో మిగిలిన డ్రైనేజీ పనులకు శ్రీకారం..






**తాడిపత్రి,జూన్10.అక్షర టైమ్స్:** కౌన్సిలర్ గా పదవీకాలం ముగిసింది.అయిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున ముందున్నారు. భగత్సింగ్ నగర్లో మిగిలిన డ్రైనేజీ పనులను ప్రారంభించడంలో ఎంతో కృషి చేశాడు. ఆ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో తన 30వ వార్డులో రూ.1.01 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాలు, పారిశుధ్య కార్యక్రమాలతో వార్డు రూపురేఖలు మార్చామని చెప్పారు. 200 మీటర్ల సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు బీటీ, గ్రావెల్ రోడ్లను పూర్తిస్థాయిలో మెరుగుపరిచామన్నారు., 30 చోట్ల గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.61.16 లక్షలు వ్యయం చేసినట్లు వెల్లడించారు. డ్రైనేజీ అభివృద్ధికి రూ.34.50 లక్షలు ఖర్చు చేసి కొత్త కాలువల నిర్మాణం, పాత డ్రైనేజీల మరమ్మతులు చేపట్టామని, ప్రస్తుతం మిగిలిన పనులకు టెండర్లు పూర్తై పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి 200 మీటర్ల కొత్త పైప్లైన్ ఏర్పాటు చేయడంతో పాటు 80 కొత్త నీటి కనెక్షన్లు అందించామని తెలిపారు. అలాగే 30 ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేసి, 90 దీపాలకు మరమ్మతులు చేపట్టామని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా 1,285 ఇళ్లకు ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ అమలు చేయడంతో పాటు 3,855 మూడు రంగుల చెత్త డబ్బాలు పంపిణీ చేశామన్నారు. 500 మీటర్ల మేర డ్రైనేజీల పూడికతీత పనులు నిర్వహించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా పార్టీలకతీతంగా భగత్సింగ్ నగర్లోని సుమారు 150 ఎస్సీ కుటుంబాలకు ఉచిత సోలార్ సిస్టమ్లు అందించడం తనకు ప్రత్యేక సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజా సమస్యలపై ప్రతి కౌన్సిల్ సమావేశంలో గళం వినిపించానని, ఐదేళ్లలో ఒక్క సమావేశానికి కూడా గైర్హాజరు కాకుండా 100 శాతం హాజరు నమోదు చేశానని తెలిపారు.ఈ సందర్భంగా తనకు ప్రజాసేవ చేసే అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి ముగిసినా ప్రజల మధ్యే ఉంటూ వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మల్లికార్జున స్పష్టం చేశారు.

## సీజ్ చేసిన వాహనాలును వేలం



**పెద్దవడుగూరు,జూన్10.అక్షర టైమ్స్:** పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 12న ఏడ ద్విచక్ర వాహనాలు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు బహిరంగ వేలం పాట నిర్వహించి వాహనాలు వేలం వేయబడును అని బుధవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. వాహనాలు కావాల్సిన ఔత్సాహికులు ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొని వాహనాలుదక్కించుకోవచ్చునన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ప్రభుత్వం నిబంధనల మేరకు, తమ ఆధార్ కార్డు, 3000 రూపాయలు పోలీస్ స్టేషన్ యందు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చున్నారు.

## యాప్ ద్వారా ఎరువులు పంపిణీ



**తాడిమర్రి,జూన్10.అక్షర టైమ్స్:** తారిమరి మండలం రైతు సోదరులకు 2026 ఖరీఫ్ సీజన్ నుండి రైతులకు ప్రభుత్వం వారు సూచించినటువంటి యాప్ ద్వారా ఎరువులు పంపిణీ జరుగుతుందని వ్యవసాయఅధికారి శేఖర్ నాయక్ తెలిపారు,మండలంలోని ఏ ఎరువుల అధికృత డీలర్ దగ్గర వెళ్లిన యాప్ ద్వారానే అమ్మకము కొనుగోలు ప్రక్రియ జరుగుతుంది కాబట్టి ఎరువుల కొరత ఎట్టి పరిస్థితుల్లో ఉండదని ప్రభుత్వము గతి చర్యలు తీసుకుంటుంది కావున రైతు సోదరులు ఎరువుల కొరత ఉంటుందని అపోహాపోక వారి వారి ఏపీఎంఎస్ యాప్ ద్వారా కొనుగోలు వివరములు యాప్ లో వారికి తెలుస్తుంది కావున రైతు సోదరులు కూడా వారికి కావలసిన మేరకు మాత్రమే ఎరువులు పొద్దడానికి అర్హులు వారు వారిపై పేరుపైన ఇతర రైతుల కొరకు కొనుగోలు కానీ డీలర్లు అమ్మకం కానీ జరుపరాదు ఏ రైతు కైతే అవసరం ఉన్నదో వారే రైతు సేవ కేంద్రం ద్వారా గాని అది కృత డీలర్ల ద్వారా గాని ఎరువులు పొందడానికి రైతులకు అర్హత కలదు కావున ఈ సంవత్సరము నుండి ఎరువుల కొరత అనేటువంటి విషయము ఏర్పడదు కావున రైతులు నిశ్చంతగా వారికి కావలసినటువంటి సమయంలో యాప్ ద్వారా కొనుగోలు చేయగలరని తెలియజేయడమైనది సదరు విషయాన్ని తోటి రైతులకు కూడా తెలియచేసి రైతుల అపోహలను దూరం చేసి రైతుల ఇక్కట్లను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వము ఈ యాప్ ద్వారా చాలా పకడ్బందీగా కొనుగోలు రైతుల ద్వారా చేయించే ప్రక్రియను ప్రవేశపెట్టింది కాబట్టి ఈ అవకాశాన్ని రైతు సోదరులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడమైనది మండలంలో సరిపడా ఎరువుల నిల్వలు ఉంచబడినవి అదేవిధంగా రైతు సేవా కేంద్రాల్లో కూడా సీజన్ మొదలైనవి కావున ఎరువుల నిలువలు సకాలంలో రైతులకు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి పరిశీలించి పర్యవేక్షించడం అయినది.